# జీవితానికి అర్థం

(1989)

"అబ్బాయి కంపెనీ నుంచి సుబ్బరామయ్య గారొచ్చి మరో మారు హెచ్చరించి వెళ్ళేరమ్మా-అవకాశాన్ని పోగొట్టుకోవద్దని అతని అభిప్రాయం-ఇక ఆలోచించుకోవలసిందీ, కార్యరూపంలో పెట్టాల్సిందీ నువ్వే" అంటూ ఆగి. సుగుణవంక చూసేరు రామానుజంగారు.

గదిలో ఒక్కమారు నిశ్శబ్దం అలుముకుంది.

ఆ యిద్దరిచూపులూ సుగుణమీదే కేంద్రీకృతమైవున్నాయి.

సుగుణ ఏమంటుందో? అసలొప్పుకుంటుందో లేదో?

సుగుణ కళ్ళెత్తి జానకమ్మ వంక చూసింది-ఆమె కళ్ళలో ఆతృత! అత్తగారూ, మామగారూ ఈనాడిలా — తన అభిప్రాయం కోసం — తన అంగీకారం కోసం — ఎంత మార్పు?

ఉద్వేగంగా వస్తూన్న నిట్టూర్పును మధ్యలోనే అణుచుకుని మరో మాటకు తావీయకుండా వెనుదిరిగి తన గదిలోకే వచ్చేసింది సుగుణ.

ఆమె గుండెల్లోంచి దుఃఖపు వెల్లువ!

కిటికీపక్కనున్న కుర్చీలో కూలబడింది సుగుణ. బయటకు చూస్తే దగ్గర్లోనే వున్నట్టుండే ఆ పచ్చటికొండ-ఆ కొండ శిఖరంలో ఎక్కడో ఒక ధార వుందట-జీవధార — కాస్త దిగువుగా హిందువుల ఆరాధ్యదైవం యొక్క కొవెల-చలువరాతితో కట్టిన ఆ కోవెల.క్రిందికి వంకీలు తిరుగుతూ దిగిన మెట్లు దూరానికి ఎంతో ముచ్చటగా కన్పిస్తాయి.

"అమ్మా అన్నం పెట్టవూ?" ఒళ్ళోకి వా[illegible]న్న విశ్వాం కళ్ళలోకి చూసింది సుగుణ. అమాయకత్వం నిండిన ఆ కళ్ళలో

వింత వెలుగు! వీడు పెద్దయితే గొప్పవాడునా కీర్తిప్రతిష్టల నార్జి స్తాడని ఎందుకో నమ్మకం! అమ్మ ఒడిలో అన్నయ్యకే స్వంతం కాకూడదన్న ఆత్రంతో మువ్వల పట్టీలను చప్పుడు చేసుకుంటూ తొర తొరగా పాక్కుంటూ వస్తోంది జయ.

వీళ్ళిద్దరే తన రెండు కళ్ళూ—వీళ్ళిద్దరే తన ఆశల ఆశయాల ప్రతిరూపాలు!

తను ఒక్క క్షణం కన్పించకపోతే బెంబేలు పడిపోయే యీ పసివాళ్ళు-తను స్వయంగా తినిపించకపోతే ఏమీ తినని యీ చిన్నా రులు—వీళ్ళను వదిలిపెట్టి—తను చేయగలదా?

లేచి, పిల్లలకు అన్నం పెట్టి, వాళ్ళని నిదురపుచ్చి మళ్ళీవచ్చి కుర్చీలో కూలబడింది సుగుణ.

బయటంతా చీకటి! కొండమీది గుడిలో తోరణాల్లా దీపాలు!

సుగుణ కళ్ళముందు జ్ఞాపకాల తెరలు!

0 0 0 0

"ఆ రాత్రీ—అమవాస్య రాత్రిలాంటి రాత్రి—!

సుగుణ కళ్ళనిండా నీళ్ళు! భవిష్యత్తంతా అంధకారమయమై పోయినట్టు మనసులో బాధ-లోపల యిమడలేక వెక్కిళ్ళరూపంలో బయటపడుతున్న దుఃఖం-సదహారేళ్ళకే జీవితంలోని చేదునంతట్నీ మింగుతున్నంత విచారం, ఈ మధ్యతరగతి ఆడపిల్లల జీవితాలు యింతేనా అన్నంత కోపం—కసి!

"సుగుణా సుగుణా!—చదివితే నువ్వొకలెక్చరువయిపోతావట-అన్ని తెలివితేటలున్నాయట నీకు! పద్మావతీ టీచర్ చెప్పింది" క్లాస్ మేట్ అరుణ అంటోంది.

"డాక్టర్‌వి కాకపోయినా కనీసం కాలేజీ లెక్చరర్‌వన్నా అయి

పోవే బాబూ-మా పిల్లల్ని నీ దగ్గరకు ట్యూషన్‌కి పంపించొచ్చు" అంది విమల.

"హోదాకి హోదా—డబ్బుకి డబ్బూ—ఏం అదృష్టమే బాబూ"

"అప్పుడైతే ఏ రాజకుమారుడిలాంటివాడో ఎం చక్కా వరించి కట్నం లేకుండానే ఎగరేసుకుపోతాడు"

"ఫోందే. చదివితే మీరూ అలా అవుతారుగా?"

"మా చదువా! గూడ్సుబండి చదువు-నీలా మాకు తెలివితేటలు లేవే!"

ఆనందం—ఆనందం—

నిజంగా తనంత తెలివయినదా? అంతటి అదృష్టం కలిసొస్తుందా?

అదే నిజమైతే-ఆర్థికంగా చితికిపోతున్న నాన్నని ఆదుకోవాలి! చెల్లెళ్ళిద్దరికీ చదువులు చెప్పించాలి. అప్పుడు-అప్పుడు తను ఉద్యోగం చేసినా. ఊళ్ళేలినా అభ్యంతరం లేని—ఆయనను పెళ్ళి చేసుకోవాలి!

సుగుణ బుగ్గలెరుపెక్కే-యి-పరీక్షలయ్యేవరకూ అలా ఊహల ఉయ్యాలల్లోనే తేలియాడింది-నమ్మకపు పునాదుల మీద భవిష్యత్ మేడలు అవలీలగా కట్టేసుకుంది.

అందులో అందాల రాకుమారిలా అంతరిగా గడిపేసింది!

అయితే ఎస్సెస్సీ పరీక్ష ఫలితాలొచ్చి ఫస్టుక్లాసులో ప్యాసై నలుగురిలోనూ గొప్పగా నిలబడ్డరోజూ-తండ్రే తనను తెలివయినదిగా పొగిడిన రోజు-ఆ రోజే తెలిసింది అసలు విషయం!

ఏడుపుకాక మిగిలిందేమిటి? అందమైన తన భవిష్యత్తుకు ఆర్థిక పరమైన యిబ్బందులే అవరోధాలు కావాలా?

డబ్బే మనిషిని చదివిస్తుందనీ. డబ్బే భవిష్యత్తుకు బంగారుబాట వేస్తుందనీ తెలుసుకున్న ఆ రోజు సుగుణకు ఎంత ఏడొచ్చిందో?

పట్నం పంపి చదివించలేనని తండ్రి-ఆడపిల్లకా చదువు చాలుననీ. యింకా చదివితే ఆ చదువుకు తగ్గ వరుడిని తెచ్చి అతనడిగిన కట్నమిచ్చి పెళ్ళిచేయడం అసాధ్యమని తల్లి.

అయితే ఆడదానికి చదువు కేవలం పెళ్ళికోసమే కాకూడదనీ. ఆ చదువు ఆర్థికపరమైన యిబ్బందులను కూడ సరిచేయగలదనీ ఎంతగానో చెప్పాలనుకుంది సుగుణ.

కానీ చెప్పలేకపోయింది—చాటుగానే ఏడ్చింది.

"అయితే నన్నింక చదివించవా నాన్నా" అడిగింది చివరిసారిగా.

"పట్నంలో వంటరిగా చదవాలమ్మా. అది సాధ్యమా చెప్పు"

"ఎలాగో కష్టపడి చదువుతా నాన్నా"

"అంత కష్టపడి చదివి ఏం చేయాలనమ్మా?"

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

"చదువుకుని ఉద్యోగం చేస్తాను నాన్నా"

"ఉద్యోగమా?" నాన్న నవ్వేడు. 'నువ్వేం ఉద్యోగంచేస్తావ్' అనే నవ్వు కాదది-'నువ్వు ఉద్యోగం చెయ్యడమెందుకమ్మా' అనే నవ్వు.

"ఆ రోజులు పోయాయమ్మా-ఆ రెండేళ్ళ చదువుకే ఉద్యోగాలొచ్చే రోజులు పోయాయి-అయినా నాకు చదివించే శక్తీ లేదు-రేపు నీ పెళ్ళయ్యాక మీ ఆయన ఒప్పుకుంటే చదివించి ఉద్యోగం వేయించమను"

నాన్న ఎంత సునాయాసంగా చెప్పేశాడు!

జీవితంలో అన్నిటినీ కోల్పోయినట్టనిపించిన ఆ రోజు ఎంతలా ఏడ్చిందో! కన్నీళ్ళింకిపోయేవరకూ ఏడ్చింది-కళ్ళు ఉబ్బిపోయేలా ఏడ్చింది-ఆనక ఏడ్చి సాధించేదేముందని వూరుకుంది.

* * * *

బయటంతా చీకటిగా వుంది-లోపలంతా నిశ్శబ్దంగా ఉంది.

సుగుణ గుండెల్లో మాత్రం దించుకోలేనంత బరువుంది.

మనసులో ఆకాశమంత కోరికుంది.

భర్త ముఖంలోకి చూస్తోంది సుగుణ-అవునంటారా? కాదంటారా?

తనేం పదిరకాల పట్టుచీరలు కావాలందా? ఆరువారాల నగలు చేయించమందా? తనేం కోరకూడని కోరికేం కోరలేదే!

అయినా భర్త మౌనం!

"ఏమండీ! మాట్లాడరేం? మీ కిష్టంలేదా?" అడిగింది గోముగా.

"అది కాదోయ్!"

"ఏది కాదు? నేనేం అడిగేననీ? చిన్నప్పట్నించీ వున్నకోరిక. పుట్టింటిలో తీరలేదు-మీరు తీరుస్తారనీ-నేను ఉద్యోగం చేస్తే మన కుటుంబానికి లాభమేగాని నష్టం వుండదు-ఆర్థికంగా కాస్త నిలదొక్కుకోవచ్చు-మనకు కలిగె సంతానానికి మంచి మంచి చదువులు చెప్పించొచ్చు!"

"నీ ఊహలు బాగానే వున్నాయి సుగుణా. కానీ యీ రోజుల్లో నువ్వు చదివిన చదువుకు ఏం ఉద్యోగాలొస్తాయనీ-నిన్ను నిరాశ పరుస్తున్నాననుకోకు! ఒకవేళ నీకేదైనా ఉద్యోగమొచ్చినా ఆ జీతం నీ రిక్షా ఖర్చులకే సరిపోతుంది."

"పోనీ.... రెండేళ్ళగా-ప్రైవేటుగా యింటర్ పూర్తి చేసి, ఆ తర్వాత...."

"అలా అన్నావ్ బాగుంది. నువ్వు చదువుకుంటూనంటే వద్దనే దెవరూ?"

ఆ మాటలకెంత సంతోషించిందో! రెండేళ్ళు ఎంతలో? తన పట్టుదల వున్న మనిషని నిరూపించాలి!

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సంతృప్తికరంగానే రాసింది సుగుణ. రెండోఏడు అలానే రాస్తే క్లాసు రావడం ఖాయం. సుగుణలో ఉత్సాహం ఉరకవేసింది-కానీ రెండో సంవత్సరం సుగుణకు పరీక్షాకాలమే అయింది-సుగుణ భయపడ్డంతా జరిగింది.

ఒక ప్రక్క సంతోషం—మరో ప్రక్క దుఃఖం.

ఛా! తను బాధపడకూడదు. ఆ ఆలోచన మొదట్లోనే వుంటే అసలిలా జరిగేదే కాదుగా!

జీవితంలో తొలిసారిగా తను తల్లికాబోతోంది! పరీక్షలు మరుసటి సంవత్సరమైనా రాయొచ్చు-సరిపెట్టుకుంది.

ఆ ఏడు పరీక్షలో నెగ్గింది సుగుణ. మగపిల్లాడు కలిగాడు. నూటికి నూరుమార్కులూ వచ్చినంత సంబరపడింది. ఇంట్లో అందరూ సుగుణకంటే ఎక్కువే సంతోషించేరు.

'రేపు తనకు ఉద్యోగమొస్తే యిలాగే సంతోషిస్తారా' అని తనకు తనే ప్రశ్న వేసుకుంది సుగుణ. ఆ ప్రశ్నకు సమాధానం రెండేళ్ళ తర్వాత తను ఇంటర్ పాసైనాక దొరికింది.

"బావుందిరా, అది మన యింటా వంటాలేదు-మగాడితో సమంగా ఆడది బయటకెళ్ళి సంపాదించుకు రావడం, మగాడు తినడం ఏమిటి" అని మావగారు-

"ఆవిడగారి సంపాదన లేకపోతే ఇల్లు గడవదా? గడవకపోతే ఎలాగో గడుపుకుంటాం-ఆవిడ బయటకెళ్తే ఆ చంటి బిడ్డన్నెవరు చూస్తారూ" అని అత్తగారు—

ఈమారూ సుగుణకి పట్టలేనంత దుఃఖమొచ్చింది-కానీ కళ్ళనుండి ఒక్క నీటి చుక్కయినా రాలేదు! మనసులో ఎన్నోమాటలు ఉద్వేగంగా రూపుదిద్దుకున్నాయి. కానీ ఒక్కమాటా పెదవులు దాటి బయటకు రాలేదు.

చదువుకొమ్మని అంతగా ధైర్యం చెప్పిన భర్త మాత్రం చేసిం దేమిటి? అమాటే అడిగితే-

"అమ్మకీ నాన్నకీ యిష్టం లేకపోతే మనం మాత్రం ఎలా ముందుకు పోగలం చెప్పు? ఆ తరంవాళ్ళకి కొన్ని అభిప్రాయా లుంటాయి-అవి మనకు ఛాదస్తాలుగా కన్పించొచ్చు-అంతమాత్రాన కొట్టిపారేయలేముగా."

సుగుణకి కోపం వచ్చింది-దుఃఖం వచ్చింది-పైకి ఏడ్వడానికి ఇప్పుడు సుగుణేమీ చిన్నపిల్లకాదు-ఓ చిన్న పిల్లవాడికి తల్లి-తల్లి కొసం, తల్లిపాలకోసం ఏడ్చే ఓ పసికందుని ఓదార్చవలసిన మాతృ మూర్తి అలానే సరిపెట్టుకుంది.

సుగుణ కాస్తో కూస్తో చదువుకున్నదయింది-ఇల్లాలయింది. కానీ ఉద్యోగుస్తురాలే కాలేకపోయింది. ఆ తర్వాత మరో రెండేళ్ళకు మరో ఆడపిల్లకూ తల్లయింది.

పెద్ద గీత ప్రక్కన చిన్న గీత ఉన్నపుడే పెద్ద గీత విలువ తెలిసేది!

ఆ జీవితం అలా వెళ్ళిపోయినా బాగుండేది!

బుద్ధ పౌర్ణమి వెళ్ళిన మూడో రోజే సుగుణ జీవితంలోకి అమావాస్య చీకటి తెరలు చోటు చేసుకున్నాయి.

ఆ రాత్రి ఎనిమిదిగంటలకు వార్త తుఫాను ముందొచ్చే సుడి గాలిలాంటి వార్త! ప్రళయం ముందు ఘనభోంతరాళాలు దద్దరిల్లేలా విన్పించే మరణ మృదంగ ధ్వనిలాంటి భయంకర వార్త!

ఆయనకు కంపెనీలో ఏక్సిడెంటయింది-ఆస్పత్రికి తరలించా రట! వార్త నిజమా కాదా అనుకునే లోగానే-అర్ధరాత్రిలోగానే అంతా అయిపోయింది.

ఇక తన జీవితమే అయిపోయిందనిపించింది సుగుణకి.

ఎర్రగా మండుతూ వెలుగునిచ్చే వొత్తి నల్లగా మాడి నుసై చీకట్లో కల్సిపోయినట్లనిపించింది-ఆమె గుండెల్లోంచి ఉబికిన దుఃఖం రక్తంలోనే కల్సిపోయింది గాని కళ్ళల్లోంచి కన్నీరుగా కారలేదు! అలా కారినా కాస్త దుఃఖం తగ్గేది!

ఆ పదిరోజులూ పరామర్శలూ, సానుభూతి మాటలూ! శ్రాద్ధ కర్మలు పూర్తికాకుండానే లెక్కలూ. ఖర్చులూ-

కొడుక్కోసం కాక ఆగిపోయిన సంపాదనకోసం ఆలోచనలు!

అల్లుడి కోసంకాక కూతురు బతుకెలా గడుస్తుందన్న వేదనలు!

ఆయన పోయిన పన్నెండు రోజుల తర్వాత-పన్నెండుయుగాల జీవన్మథనం తర్వాత హాలాహలం లాంటి సమస్య ఎదురైంది.

అదే....డబ్బు సమస్య!

సుగుణ కేవలం పెన్షన్ డబ్బులతో జీవిస్తున్న మామ గారింట్లోనే వుంటుందా? లేక ఎదిగిన యిద్దరాడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయకుండానే రిటైరైన తండ్రి పంచకు చేరుతుందా?

సుగుణ జీవితానికి దారేదీ?

ఆ పిల్లల బతుకులకు భవిష్యత్తేదీ?

అయితే సుగుణ సమస్యకు....సుగుణ బతుకు సమస్యకు, ఆమె డబ్బు సమస్యకు, పరిష్కారం తొందరలోనే దొరికింది.

భర్తపనిచేసిన కంపెనీలోనే సుగుణకు ఉద్యోగం యిస్తారట!

ఉద్యోగి చనిపోతే ఆ కుటుంబంలోని ఒక వ్యక్తికి అంటే.... భార్యకో, సంతానానికో వారివారి విద్యార్హతలను బట్టి ఏదో ఒక ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబాన్ని ఆదుకునే జాలిగుండె వుందా కంపెనీకి!

ఇంకేం? సుగుణ చదువుకున్నదీ, తెలవయినదీను-

సుగుణ సమస్య పరిష్కరింపబడ్డట్టే అనుకున్నారంతా—

కానీ-ఆ సంగతి తెల్సిన క్షణంలో ఆకులూ కొమ్మలూ కొట్టి వేయబడ్డ మానులా అచేతనంగా నిలబడి పోయింది సుగుణ.

"లోకాన్ని దేవుడింకా పాలిస్తున్నాడమ్మా-మంచి వాళ్ళకో దోవ చూపిస్తూనే వుంటాడు"

"మనిషిపోతే ఎలాగూ తేలేం-కానీ ఉన్నవాళ్ళు బతకాలిగా! దానికొసం కొంత సర్దుబాటు తప్పదు"

"ఐదోతనం-ఎవరికెంత రాసి పెట్టుంటే అంత! పిల్లలదృష్ట వంతులు"

ఇలా ఎన్నో మాటలు....సుగుణ చెవిన బడ్డాయి.ఎవరేమంటున్నదీ ఆమె గమనించలేదు. సుగుణ మనసంతా మొద్దుబారిపోయింది-ఆమె నోరు మూగబోయింది-ఆమె కనులు రెప్పలార్పడం మర్చిపోయేయి!

"నువ్వు సరదాపడి చేస్తానన్నపుడు అడ్డుపడి వద్దన్నాం—కానీ ఇప్పుడదే తప్పనిసరైంది-వాడి పిల్లలు అదృష్టవంతులు కాబట్టి నీ వంటి తల్లి గొరికింది"-అంటోంది సుగుణ అత్తగారు జానకమ్మ.

"ఆడది ఇల్లు కదలకూడదనీ, మగాడే సంపాదించాలనీ నీతులు చెప్పేను-మగాడినై వుండీ నేనిప్పుడేం చేయగలుగుతున్నాను? కన్న కొడుకు మీద ఆశలు పెంచుకున్న నేనివుడు ఒడిపోయానమ్మా.ఒద్దన్న నోటితోనే యిప్పుడు నిన్ను ఉద్యోగం చెయ్యమని చెప్పాల్సివస్తోంది" అంటున్నాడు సుగుణ మామగారు రామానుజం.

సుగుణ ఎవరి మాటకూ జవాబివ్వలేదు.

ఎంత రెట్టించినా ఔననటం లేదు-కాదనటం లేదు.

తనా ఉద్యోగం చేస్తానని గాని,చెయ్యనని గాని చెప్పటం లేదు.

సుగుణ తల్లీ దండ్రీ కూడ వచ్చారు.

"కన్నవారిమైనా అప్పటిలో నీ కోర్కె తీర్చలేకపోయాం తల్లీ-

పట్టుదల గలిగిన దానిని కాబట్టే చదువుకున్నావ్-ఎంతటి దురదృష్ట వంతులకైనా అదృష్టం ఏదో ఒక రూపంలో సాక్షాత్కరిస్తూనే వుంటుంది. దాన్ని మనం కాదనకూడదు-మా అందరి మీదా నీకు కోపం వుండొచ్చు-ఒక ఆడపిల్లని ఆదుకోలేక ఉద్యోగం చేయమంటున్నామని బాధవుండొచ్చు-కానీ మేమెవరిమైనా ఎల్లకాలం నిన్ను ఆదుకోలేం కదా సుగుణా! మా మాట వినూ ఆ పిల్లల ముఖాలు చూసైనా.... కాదనకు."

కళ్ళు కదిల్చి వారి వంక చూసింది సుగుణ.

ఎండకు ఎండి, వానకు తడిసి వెలిసిపోయిన వాల్ పోస్టర్ మీది ఆది దంపతుల్లా కన్పించారు తల్లిదండ్రీ-వాళ్ళిద్దరి కళ్ళలోనూ బాధతో కూడిన తడి'-

ఆపుకోలేని దుఃఖంతో బావురుమంటూ కూలిపోయింది సుగుణ.

* * *

కళ్ళు తుడుచుకుని కుర్చీలోంచి కదిలింది సుగుణ.

అర్ధరాత్రి ఎప్పుడో దాటింది!

లోకం తెలియని పిల్లలిద్దరూ గాఢ నిద్రలో వున్నారు.

లోకం కూడ సగం నిద్రలోనే వుందా?

ఉద్యోగం చెయ్యాలనే చిన్ననాటి తన సరదా రాత్రానూ ఎంత బలమైన కోరికగా ఏర్పడిపోయింది.

ఎదిగే వయసుతో పాటు, మనసుతో పాటు అదీ ఎదిగి పోయింది.

ఆ కోర్కె కొసం ఎన్నాళ్ళు ఎందర్ని బతిమాలింది?

ఎన్నిరోజులు ఏడ్చింది?

ఎంత క్షోభ పడింది? ఎంతలా కుమిలింది!

ఆడపిల్లని చదివించాలంటే భయం-

ఆడపిల్లచేత ఉద్యోగం చేయించాలంటే భయం.

అలా భయపడ్డవాళ్ళంతా....అలా కాదూ కూడదూ అన్న వాళ్ళంతా యిప్పుడిలా అంటూంటే....అంతాగా కోర్కె వున్నతనే.... యీ రోజు ఎందుకో ముందుకు రాలేకపోతోంది.

అంగీకరించలేకపోతోంది. అంత త్వరగా

ఎన్నాళ్ళ కోర్కె అయితే మాత్రం యిప్పుడిలా తీర్చుకో గలదా?

ఈ భూమినిప్పుడుఆదిశేషుడు మోయడంలేదట—నాణేలరూపంలో నోట్లరూపంలో వున్న డబ్బే మోస్తోందట.

తన జీవితం సాఫీగా గడవడంకోసం....పిల్లల్ని పెంచడం కోసం ఆ డబ్బే కావాలి!

డబ్బు మనుషుల్లోని ఆలోచనల్ని ఎంతలా మార్చేస్తుంది? తనకు, తన ఆలోచనలకూ కాస్తోకూస్తో విలువ నిచ్చే ఆ విలువైన మనిషి....ఆయన పోయి, తనకు మిగిల్చినదేమిటి?

అప్పుడు కాదని ఇప్పుడు ఔననే యీ పెద్దల ఆలోచనల వెనుకనున్నదేమిటి?

సుగుణకర్థం కాలేదు.

అన్నిటికీ వెనుకనున్న పరమార్థం....అంతర్వాహిని—' అర్థమేనా?

సుగుణ ఆలోచిస్తోంది—ఆలోచిస్తూనే వుంది! ❋